Nabiyon-ke-Halaat-II
(Telugu)

దైవప్రవక్తలు

రెండవ భాగం

మూలం:

మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం:

ఇఖ్బాల్ అహ్మద్

కరుణించేవాడు కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో

హజ్రత్ సాలెహ్ (అలైహిస్సలామ్)

దైవధిక్కారం - పర్యవసానం

ఆద్ జాతి తరువాత సమూద్ జాతి ముందుకు వచ్చింది. అదీ బాగా ప్రగతి సాధించింది. ఎత్తయిన భవనాలు, పచ్చని పొలాలు, ఖర్జూరపు తోటలు, ధన ధాన్య సంపదలన్నీ వాని చేతుల్లోకి వచ్చాయి. క్రమేణా వారిలోనూ చెడులు దారిచేసుకున్నాయి. వారి హృదయాల నుండి దైవ నామసంస్మరణ దూరమవసాగింది. వారిలోని ధనవంతులు గర్విష్టులయ్యారు. చిన్నవారిపై, బీదవారిపై జులుం చెయ్యసాగారు. ధనవంతుల వైఖరి ఎప్పుడైనా ఒక్కటే. అంతా తమ కోసమే, ఇతరులకు బాధ కలిగినా, కష్టం సంభవించినా వారికి తమ ప్రయోజనాల వరకే శ్రద్ధ. ధనమదం వారిని గ్రుడ్డివారిగా చేసివేసింది. దైవాన్ని విస్మరించి ఇష్టం వచ్చినట్లు చెయ్యసాగారు.

అల్లాహ్ వారికి సన్మార్గం చూపడానికి హజ్రత్ సాలెహ్(అ)ను ప్రభవింపజేశాడు. ఆయన ఆ ప్రజలతో అన్నారు, "సోదరులారా! మీరు దైవానికి భయపడరా? చూడండి, ఆయన తప్ప మీకు ప్రభువు, స్వామి మరెవ్వరూ లేరు. ఆయన్నే ఆరాధించండి. ఆయనే కదా మిమ్మల్ని పుట్టించాడు. భువిపై నివసింపజేశాడు. రకరకాల సామగ్రి సృష్టించి, మీ జీవిక కొరకు ఏర్పాట్లు చేశాడు."

ఆ జాతి ప్రజలు విన్నారు. వారికి ఈ మాటలు వింతగా తోచాయి. వారు అన్నారు. "సాలెహ్, మేము నీపై ఎన్నో ఆశలు పెంచుకున్నాము. నీవు జాతికే ఆశాజ్యోతివి. నీవు చేసే ఈ ప్రేలాపనలు ఏమిటి? ఈ దేవతల్ని వదలివేయమంటావా మమ్మల్ని? ఈ దేవతలనైతే మా తాతముత్తాతలు కూడా

మొక్కేవారే, పూజించేవారే. నీవు చెప్పే ఈ విషయం పట్ల మాకయితే గొప్ప సందేహమే ఏర్పడింది.''

హజ్రత్ సాలెహ్ (అ) వారితో, ''అన్నలారా! ఈ విశ్వప్రభువు- ఆయన నాకూ ప్రభువే, మీకు కూడా ప్రభువే- నన్ను తన ప్రవక్తగా మీ వద్దకు పంపించాడు. నేను చెప్పేదంతా నా తరఫున ఏ మాత్రం కాదు. అల్లాహ్‌కు భయ పడండి. నా మాట వినండి. నేను మీ నుండి ఏ ప్రతిఫలాన్నీ కోరడం లేదే'' అని అన్నారు.

దానికి ఆయన జాతివారు, ''బాగుందయ్యా! ప్రవక్త కావడం కూడా భేషుగ్గానే ఉంది. నీవు దైవప్రవక్తగా ఎప్పటి నుంచి అయ్యావు? నీవు కూడా మాలాంటి సామాన్య మనిషివేనే? ఓహో ఎవరో నీపై మంత్రం చేశారు. అందువల్లనే నీవు ఇంతేసి మాటలు అంటున్నావు'' అని బదులిచ్చారు.

''నా సోదరులారా! అలా కాదు. నేను పలికేదంతా మీ ప్రభువు తరఫు నుండే. నిజానికి నేనే భయపడ్తూ ఉంటాను. ఒకవేళ నేను ఆ ప్రభువు ఆజ్ఞల్ని పాలించకుంటే, ఆయన సందేశాన్ని మీకు వినిపించకుంటే నన్ను ఆయన పట్టు నుండి రక్షించగలవారెవరు? నేను మళ్ళీ మీతో ఇదే అంటాను. మీరు అల్లాహ్ ధిక్కారుల మాట వినకండి. దేశంలో అల్లకల్లోలాన్ని సృష్టించేవారి, ఇంకా సంస్కరణ చెయ్యలేనివారి ఆజ్ఞల్ని పాలించకండి. విధేయత అన్నది, ఆజ్ఞాపాలన అన్నది కేవలం దైవం పట్లే జరగాలి'' అని బోధించారు హజ్రత్ సాలెహ్(అ).

సమూద్ జాతి ప్రజలు అంతా విని ఇలా అన్నారు, ''సరే, అయితే నీవు దైవ ప్రవక్తవని మేమెలా నమ్మాలి? అదే నిజమైతే ఏదైనా నిదర్శనాన్ని మాకు చూపు. అప్పుడు మేము నీ మాటను ఒప్పుకుంటాము.''

వారి ఈ మాటల తరువాత అల్లాహ్ అకస్మాత్తుగా ఒక ఆడ ఒంటెను సృష్టించాడు. అది ఇతర ఒంటెలకు భిన్నంగా ఉండేది, దాన్ని చూపి హజ్రత్ సాలెహ్(అ) అన్నారు, ''చూడండి, ఈ ఒంటె అల్లాహ్ సృష్టించిన ఒక నిదర్శనం. దీన్ని స్వేచ్ఛగా మెయ్యనివ్వండి. దీన్ని ఎవరూ బాధపెట్టకండి, ఒకవేళ మీరు

దీన్ని చూచి కూడా నా మాటను కాదని ఈ ఒంటెను కష్టపెట్టారంటే ఇక మీరు అల్లాహ్‌ను ఏవిధంగానూ విశ్వసించడానికి సిద్ధంగాలేరని అర్థం. మీరీ విధంగా ప్రవర్తిస్తే మీపై అల్లాహ్ శిక్ష పడుతుంది. అది మిమ్మల్ని సర్వనాశనం చేస్తుంది, మీరు జ్ఞాపకం ఉంచుకోండి. ఏ సిరిసంపదలపై నేడు మీరు విర్రవీగుతున్నారో అవి ఆ ప్రభువు, అల్లాహ్ ప్రసాదించినవే. ఆయనే మీకు ఆద్ జాతి తరువాత భూమిపై నివాసం కల్పించాడు. మీరు అల్లాహ్ ప్రసాదించిన వరాలకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. భూమిపై కల్లోలాన్ని సృష్టించరాదు."

హజ్రత్ సాలెహ్ (అ) బోధనల్ని శ్రద్ధగా విని, కొందరు బడుగు వర్గాలవారు, కొందరు బలహీన వర్గాలవారు ఆయనకు తోడయ్యారు. శ్రీమంతులు, పెద్దలనబడేవారు వారికి శత్రువులయ్యారు. వారు ఆ బలహీన ప్రజలతో, "మీరు నిజంగానే సాలెహ్‌ను దైవప్రవక్తగా విశ్వసిస్తున్నారా?" అని అడిగారు. దానికి వారన్నారు, "మాకయితే గట్టి నమ్మకముంది- హజ్రత్ సాలెహ్ (అ) దైవప్రవక్త అని."

అది విని ఆ పొగరుమోతు ప్రజలు, "చూడండి, మీరు ఎవరినయితే సత్యవంతుడంటున్నారో, మేమతన్ని అసత్యవాది అనంటున్నాము" అని ప్రకటించి మొట్టమొదట వారు అల్లాహ్ తన నిదర్శనంగా పుట్టించిన ఒంటెను పట్టుకున్నారు. ముందు దాని కాళ్ళను నరికేశారు. ఆ తరువాత దాన్ని చంపేశారు. అప్పుడు హజ్రత్ సాలెహ్(అ)తో తలబిరుసుగా అన్నారు, "ఒకవేళ నీవు దైవప్రవక్తవే అయితే నీవు రోజూ మమ్మల్ని భయపెట్టే ఆశిక్షను పిలిపించు."

"అలాగే కానివ్వండి, ఇంకా మూడు రోజులు మీ ఇండ్లల్లో సుఖపడండి. ఇది అబద్ధమయ్యే వాగ్దానం కాదు."

గమనించారా! సమూద్ జాతి ఎంతగా చెడిపోయిందో. అది సన్మార్గానికి వచ్చే ఇక ఏ ఆశా లేదు. అందువల్ల దాన్ని అంతమొందించాలని దైవ నిర్ణయం జరిగింది. అల్లాహ్ తన కారుణ్యంతో హజ్రత్ సాలెహ్(అ)ను, ఆయన అనుయాయుల్ని రక్షించాడు. ఎవరయితే దైవప్రవక్త మాటను కాదని తమపై తామే అన్యాయం చేసుకున్నారో వారిని అల్లాహ్ శిక్ష పట్టుకుంది.

ఒంటెను చంపేసిన మూడో రోజున ఆ ప్రజలు రాత్రివేళ తమ తమ ఇండ్లల్లో సుఖనిద్రలో ఉండగా భయంకరమయిన భూకంపం వచ్చింది. ప్రజలు ఎంతో భీకరమయిన శబ్దాలు విన్నారు. తెల్లవారిన తరువాత చూస్తే అందరూ తమ తమ ఇండ్లల్లో బోర్లాపడి ఉన్నారు. దైవధిక్కారులందరూ అంతమయ్యారు. ఆ బస్తీలో ఎప్పుడూ, ఎవరూ నివసించలేదన్నంతగా అది తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పుడు సమూద్ జాతి నగరం, నగరంగా లేదు. ఇటుకల కుప్పలుగా, గొప్ప శిథిలాలుగా మారిపోయింది.

బాగా వినండి, సమూద్ జాతి తమ ప్రభువు ఉపదేశాలను స్వీకరించడానికి సమ్మతించలేదు. అందువల్లనే సమూద్ ప్రజలు అల్లాహ్ కారుణ్యానికి దూరంగా విసిరివేయబడ్డారు.

ఇవి పూర్వపు జాతుల గాధలు. మనకు వీటిలో గుణపాఠముంది. ప్రపంచంలో ప్రశాంతంగా వృద్ధివికాసాలు పొందడానికి దైవదాస్యం చెయ్యడం, ఆయన ప్రవక్తను అనుసరించడం తప్ప మరో మార్గం లేదు.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్)

ఎక్కడి దైవాలివి?

మనిషి దేవుణ్ణి మరచిపోతున్నాడు. అందుకే అల్లాహ్ మాటిమాటికి తన ప్రవక్తలను పంపుతూవచ్చాడు. ఈ ప్రవక్తలు మానవులకు సన్మార్గం చూపారు. హజ్రత్ ఇబ్రాహీమ్(అ) కూడ ఒక దైవప్రవక్తే. ఆయన జన్మించిన కుటుంబం ఎలాంటిది? దేవీదేవతల విగ్రహాలను తయారుచేసి, బజారులో అమ్మడం వారి వంశ వృత్తి. వీరు విగ్రహాలను పూజించేవారు, అంతేకాదు, మొత్తం దేశమే అల్లాహ్‌ను మరచి, దేవీదేవతల ఆరాధనల్లో మునిగి ఉండేది.

అందరూ విగ్రహాల ఎదుట మోకరిల్లి, వాటినే అర్థించే వారు. వారు నక్షత్రాలను కూడా పూజించేవారు. సూర్యుడు, చంద్రుడు కూడా వారి దేవతలే. ఈ విధంగా వీరు ఒక్కడే అయిన దైవాన్ని వదలి అసంఖ్యాకమయిన దేవతల్ని ఏర్పరచుకున్నారు.

దైవాన్ని గుర్తించడం

హజ్రత్ ఇబ్రాహీమ్(అ) కాస్త పెరిగి పెద్దవారయిన తరువాత, తన కుటుంబీకులు, తన జాతి (వారి) చేష్టలను చూసి ఆలోచనలోపడ్డారు. మనం మన చేతులతో తయారుచేసే విగ్రహాలకు, కోర్కెల్ని నెరవేర్చే శక్తి, మనకు లాభనష్టాలను కలుగజేసే శక్తి ఎక్కణ్ణుంచి వస్తుందో అర్థం కాలేదు. ఆయన ఆ విషయాన్ని గురించి పదే పదే ఆలోచించేవారు. ఒకసారి ఏమయిందంటే, హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) రాత్రి పూట ఆకాశంపై మెరిసే ఒక నక్షత్రం చూచారు. ప్రజలు దాన్ని పూజించేవారు. వారిని చూచి హజ్రత్ ఇబ్రాహీమ్(అ), "ఈ నక్షత్రమే నా దేవుడు" అన్నారు. కాని కొంతసేపటికి ఆ నక్షత్రం కనుమరుగవ సాగింది. అది అస్తమించడం చూసి ప్రవక్త, "ఈ మరుగుపడేవి నాకు మంచివి కావనిపిస్తోంది" అన్నారు. మరి కాస్సేపటికి కాంతిని విరజిమ్ముతూ చంద్రుడు ఉదయించాడు. దాన్ని చూచి "ఇతడే (చంద్రుడు) నా దైవం" అన్నారు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ). కాని కొంతసేపటికి చంద్రుడూ మాయమయ్యాడు. అది చూసి హజ్రత్ ఇబ్రాహీమ్, "ఇతడు కూడా నా దైవం కాదు. నా దైవమైతే (ప్రభువు) వేరెవరో ఉన్నారు. ఆయనేగనక నాకు సన్మార్గం చూపకపోతే నేను కూడా నా జాతివారిలాగే భ్రష్టుడినవుతాను" అన్నారు.

తెల్లవారగా సూర్యుడు ఉదయించాడు. ధగధగలాడే ఉజ్వలమయిన సూర్యబింబాన్ని చూసి హజ్రత్ ఇబ్రాహీమ్(అ). "ఆఁ ఇతడే నా దైవం, అన్నిటికన్నా గొప్పవాడు." కాని, పగలు పూర్తయి, సాయంత్రమయేసరికి సూర్యుడు కూడా ముఖం చాటుచేసుకున్నాడు.

సందేశ ఆరంభం

అది చూచి హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తన జాతివారితో ఈ విధంగా అన్నారు, "సోదరులారా! ఇటువంటి దైవాలతో విసుగెత్తిపోయాను. ఇవెక్కడి దైవాలు? ఇవన్నీ మరొకరికి లోబడి ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని చూస్తుంటే, ఇవి వేరొకరు ఏర్పరచిన నియమాల ప్రకారం నడుస్తున్నాయి. ఆయన కోరిక

నెరవేర్చడంలో నిమగ్నమై ఉన్నాయి. ఇవి తమకు తోచినట్లుగా ఉదయించనూ లేవు, తమ ఇష్టానుసారం అస్తమించనూలేవు.

"సోదరులారా! ఎవరైతే భూమ్యాకాశాలను సృష్టించారో, ఎవరు ఏర్పరచిన సూత్రాలపై సూర్యచంద్రులు తిరుగుతున్నాయో ఆయన్నే నేను ఆరాధిస్తాను. నా ప్రభువు, నా యజమానీ ఒక్కడే! ఆయనకు సహవర్తులుగా మరెవ్వరినీ నేను అంగీకరించను. ఈ సూర్యుడు, చంద్రుడు ఆయన ఆజ్ఞ ప్రకారమే పరిభ్రమిస్తున్నాయి. వాటిని పూజించడం మాత్రం సరయింది కాదు. నేను అన్ని వైపుల నుండి ముఖం మరల్చుకుని కేవలం ఆ ఏకైక దేవుని (అల్లాహ్) పూజారినయిపోయాను, ఆయనకు సహవర్తునిగా ఎవరినీ ఒప్పుకోను."

హజ్రత్ ఇబ్రాహీమ్(అ) మాటలు విని ఆయన జాతివారు జగడం మొదలెట్టారు. వారన్నారు, "ఇలా మా తాతముత్తాతల నుండే జరుగుతూ వచ్చింది. మరి మా పెద్దలు మూర్ఖులా? మా పూర్వీకులు ఈ మాటలను అర్థం చేసుకోలేకపోయారా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) జవాబు ఇచ్చారు:

"ఇదేం మాట! అల్లాహ్ విషయంలో మీరు జగడమాడుతున్నారా? ఆయన నాకే సత్యవాక్యాన్ని వివరించాడు అంటే, ఇదంతా ఆయన చలువే. నాకు మీరంటే ఎలాంటి భయమూ లేదు. అల్లాహ్‌కు సహవర్తులుగా చేసుకున్న మీ దేవీదేవతలకు కూడా భయపడను, నా ప్రభువు ఇష్టప్రకారమే అంతా జరుగుతుంది. ఆయన సర్వశక్తిమంతుడు, ప్రతి విషయాన్ని గురించీ పూర్తిగా తెలిసినవాడు.

"మీరు అల్లాహ్‌కు సహవర్తులుగా నిలబెట్టినవాటకి నేను ఎందుకు భయపడాలి? ఈ విషయం పూర్తిగా తప్పు అని నాకు తెలుసు. మీ వాదనకు సాక్ష్యమేదీ లేదు. ఇదంతా మీ కల్పితం. అల్లాహ్‌ను విశ్వసించినవారి హృదయాలు పటిష్టమయినవి. ఇంకా వారే రుజుమార్గంపై ఉన్నవారు."

తండ్రికి ఉపదేశం

అల్లాహ్, హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కు సన్మార్గం చూపించాడు. ఆయనకు సత్యాన్ని గుర్తించే జ్ఞానాన్ని ఇచ్చాడు. సత్యాన్ని తెలుసుకున్న తరువాత హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన తండ్రితో కూడా సంభాషించారు, తండ్రి విగ్రహాలను తయారుచేసి అమ్మేవారు, వాటిని పూజించేవారు కూడా. ఒక రోజు ఇబ్రాహీమ్ (అ) తన తండ్రితో, "నాన్నగారూ! వినలేని, చూడలేని, ఇంకా మీకు ఏ విధంగానూ పనికిరాని విగ్రహాలనెందుకు పూజిస్తారూ?

"నాన్నా! అల్లాహ్ నాకు జ్ఞానాన్ని ప్రసాదించాడు. నేను చెప్పేది వింటే మీకు సన్మార్గం చూపుతాను. మీరు చేస్తున్నదంతా షైతాన్ మోస ఫలితమే. మీరు షైతాన్ మార్గాన్ని విడనాడండి. షైతానే దారితప్పి ఉన్నాడు, అల్లాహ్ ఆజ్ఞను ధిక్కరించినవాడు. నాన్నా! మీకు దైవశిక్ష పడుతుందేమో? అని నేను భయపడుతున్నాను. అప్పుడు షైతాన్ స్నేహం మీకు ఏ మాత్రం సాయ పడదు."

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తండ్రి ఈ సంభాషణంతా విని ఉగ్రుడయ్యాడు. "ఓహో! నీవు మా దేవీదేవతల్ని తిరస్కరిస్తున్నావన్న మాట. చూడు, నీ వైఖరి మారకుంటే, నీవు ఎప్పుడూ గుర్తుంచుకునేలా రాళ్ళతో కొడతాను, ఫో! నా ఎదుట నుండి" అన్నాడు.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కు తండ్రి మాటలు చాలా దుఃఖాన్ని కలిగించాయి. "సరే! మీరు నన్ను వెళ్ళగొట్టదల్చుకుంటే వెళ్ళగొట్టండి. నేను మాత్రం అల్లాహ్ మిమ్మల్ని క్షేమంగా ఉంచాలని కోరుతున్నాను. నా ప్రభువు అమితదయాళువు, ఆయన మీ తప్పుల్ని మన్నించాలనీ, ఇంకా మీకు సన్మార్గం చూపాలనీ వేడుకుంటాను.

"నేను మిమ్మల్నీ, మీరు పూజించే దేవీదేవతల్ని వదలటానికి సిద్ధంగా ఉన్నాను. కాని నా ప్రభువు (అల్లాహ్)ను విడువలేను, ఆయన్ని పిలువకుండా ఉండలేను."

సందేశ పరంపర

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ని ఇంటి నుండి వెళ్ళగొట్టారు. ఆయన సత్యం కోసం, తన ఇల్లు, సిరిసంపదలు, తన తండ్రి నుండి సంక్రమించే పూజారి స్థానం సమస్తాన్ని వదలుకున్నారు.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ఏ మాటలయితే తన తండ్రితో చెప్పారో, వాటినే (బోధలే) తన నగరంలోని ఇతర ప్రజలకు కూడా చెప్పారు. ఆయన ఏ విషయాన్నయితే సత్యమని అంగీకరించి దాన్ని స్వీకరించారో, ఆ విషయాన్నే ప్రజలకూ వివరించేవారు. "సోదరులారా! మీరు ఈ విగ్రహాల్ని ఎందుకు చేసినట్లు. స్వయంగా మీరే తయారుచేసి వాటినే ఎలా ఆశ్రయిస్తారు? ఈ విగ్రహాలు మీకేమాత్రమయినా లాభం చేకూర్చగలవా? పోనీ, ఏమయినా నష్టాన్ని కలిగించే శక్తి వీటికి ఉందా?" అని ప్రశ్నించారు.

నగరవాసులన్నారు: "మా తాతముత్తాతల నుండి ఇలానే జరుగుతూ వచ్చింది. మా పెద్దలు కూడా ఈ విధంగానే విగ్రహారాధన చేయడం మేము చూశాం."

ప్రవక్త (అ) ఇలా అన్నారు: "నా సోదరులారా! మీరు చేసినా, మీ పెద్దలు చేసినా విగ్రహారాధన తప్పే కదా! ఒక చెడు పనిని ఎవరయినా చేసినంత మాత్రాన అది మంచి పని అయిపోతుందా? మనిషి తన వివేకాన్ని ఉపయోగించాలి. పెద్దలు ఆచరిస్తూ వచ్చిందల్లా మంచి పనే అని అనుకోరాదు."

ఇది విని వాళ్ళు, "సరే! నీవు మా విగ్రహారాధనని వ్యతిరేకిస్తున్నావు. నీ ఇష్టమొచ్చినదాన్నల్లా చెడ్డ పని అని చెప్పడానికి ఇదేమయినా నవ్వులాటనుకున్నావా? దానికి బదులుగా మరేదైనా మంచి విషయం, సత్యమైన విషయం తీసుకొచ్చావా?" అని అవహేళన చేశారు.

బదులుగా హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ఇలా సెలవిచ్చారు, "ఎందుక్కాదు? భూమ్యాకాశాల నిర్మాత, యజమాని అయిన అల్లాహ్యే మీ అసలు

ప్రభువు, యజమాని అని, ఆయనే సమస్తాన్ని సృష్టించాడని చెబుతూనే ఉన్నాను కదా!"

ప్రజలు ఈ మాటలన్నీ విని ఏ మాత్రం తిరస్కరించలేకపోయారు. ఎలా తిరస్కరిస్తారు? వాళ్ళు తయారుచేసిన ఏ విగ్రహమూ మొత్తం విశ్వానికి సృష్టికర్త, యజమాని కాదు- మరెవరోనని వారికి మాత్రం తెలియనిదా! కాని వారికి, తమ పెద్దల ఆచార సంప్రదాయాలు, తమ దేవీదేవతల పూజా కార్యక్రమాలను విడిచిపెట్టడం చాలా కష్టసాధ్యం. వారు అంతా వినడం మటుకే. కాని ఆచరించేది మటుకు తమ బుద్ధికి వచ్చినట్లుగానే. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) వారికి నచ్చజెప్పి నచ్చజెప్పి అలసిపోయి వారిని మార్చడానికి ఒక చిన్న ఉపాయం ఆలోచించారు.

నూతన పంథాలో సందేశం

ఓ రోజు ఊరివారంతా ఎక్కడికో వెళ్ళారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) మాత్రం వెళ్ళలేదు. ఆ రోజు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) వాళ్ళ విగ్రహాలనన్నింటినీ విరగ్గొట్టారు. ఒక పెద్ద విగ్రహాన్ని మాత్రం అలా ఉంచారు. బయటికెళ్ళినవారంతా తిరిగివచ్చి చూసి కోపంతో చిందులు వేశారు. "మా దేవతలకీ దుస్థితి తెచ్చిందెవరు? ఈ పని చేసినవాడెవడో పరమ దుర్మార్గుడు." ఇంతలో ఎవరోఅన్నారు, "ఇదేదో ఆ ఇబ్రాహీమ్ అనే యువకుడి పనే అయ్యుంటుంది. వాణ్ణి పిలవండి, వూళ్ళో వాళ్ళందర్నీ పిల్చి, వాడు చేసిన ఈ చేష్టను చూపించండి."

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) వచ్చాక వాళ్ళు, "ఏం ఇబ్రాహీమ్, మా దేవతలతో ఈ చెలగాటమాడింది నీవేనా?" అని ప్రశ్నించారు. ఆయన జవాబిచ్చారు, "ఈ పెద్ద దేవతా విగ్రహాన్నే అడగండి. బహుశా అదే ఇదంతా చేసిందేమో అడిగి చూడండి, అన్నీ వివరంగా చెబుతుందిగా!"

ఇది విని వాళ్ళంతా ఆలోచనలోపడ్డారు. "ఎంత అజ్ఞానం! వీటినా మనం దేవతలుగా భావించేదీ? ఇవి మనల్ని సంరక్షించడం అటుంచి

తమనుతాము రక్షించుకోలేవు కదా!" అందరూ అవమానభారంతో క్రుంగిపోయారు. అందరి ముఖాలు పాలిపోయాయి. కొద్దిసేపయ్యాక హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)తో వారు అన్నారు. "ఇవి ఎంతవరకు మాట్లాడతాయో మీకు తెలుసు కదా! కాస్త మీరే చెప్పండి, అసలేం జరిగిందో?"

"సోదరులారా! కాస్త ఆలోచించండి, అల్లాహ్‌ను కాదని లాభంగాని, నష్టంగాని కలిగించలేనటువంటి వీటినా మీరు పూజించేది? మీతోనూ, మీరు పూజించే దేవీదేవతలతోనూ నేను విసుగెత్తిపోయాను. అసలు యజమాని ఎవరు? లాభనష్టాలు ఎవరి చేతుల్లో ఉన్నాయి? అనే విషయం కూడా మీరు గ్రహించలేకపోయారు. ఆపాటి ఇంగిత జ్ఞానం మీకు లేకపోయింది."

ప్రవక్తను అంతమొందించే నిర్ణయం

ఇది విన్న వెంటనే అందరూ కోపంతో ఊగిపోయారు. విగ్రహాలను నాశనం చేసిందెవరో అందరికీ అర్థమయిపోయింది. అందరూ ఏకగ్రీవంగా, "ఇబ్రాహీమ్‌ను నిప్పుల్లో పడవేయండి. ఆ విధంగా మన దేవతల ప్రతీకారం తీర్చుకుందాం" అని నిర్ణయించారు.

అంతే ఒక పెద్ద అగ్ని గుండాన్ని తయారు చేశారు. బండ్లకొద్దీ కట్టెలు పేర్చి నిప్పు అంటించారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను మండే అగ్నిలో పడవేశారు.

అల్లాహ్ రక్షించదలచినవారిని ఎవరు చంపగలరు? హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను ఆయన శత్రువులు అగ్నిలో పడవేసి ఇక ఆయన పని సమాప్తమని అనుకున్నారు. కాని మీరే ఆలోచించండి. నిప్పు ఎందుకు కాలుస్తుంది? దాన్ని పుట్టించినవాడు (అల్లాహ్) దానికి దహించే శక్తినిచ్చాడు గనక. అలాంటప్పుడు ఆ దైవమే దహించకూడదని కోరితే అది ఎలా దహించగలుగుతుంది? హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను వాళ్ళు మంటలో వేశారు. కాని అల్లాహ్ ఆయనచేత ఇంకా ఎన్నో గొప్ప పనులు చేయించదలిచాడు. అంత తేలిగ్గా

ఆయన అంతమవుతారా? అల్లాహ్ ఆజ్ఞతో మంటలు చల్లారాయి. ఎలా చల్లారాయో తెలియదు. కాని హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను మంటల నుండి రక్షించే అద్భుతం మాత్రం జరిగిందని తెలియవస్తోంది.

హిజ్రత్

ఇక తన దేశవాసులు తన మాట వినరని హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) రూఢీగా తెల్సుకున్నారు. వారికిప్పుడు నచ్చజెప్పడం కూడా దండగే. మరో దేశానికి వెళ్ళి అక్కడి ప్రజల్ని దైవ మార్గం వైపునకు పిలవాలని నిశ్చయించు కున్నారు. ఆ మహా కార్యం కోసం హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన జాతిని, తన దేశాన్ని, కన్నతండ్రిని, స్వంత ఇల్లును, బంధుమిత్రులను, ఒక్క మాటలో చెప్పాలంటే తన సర్వస్వాన్ని వదలి బయలుదేరారు, ఇల్లు వదలి దేశాలు సంచరించారు. ప్రజలకు దైవ సందేశం వినిపించారు, దైవ ధర్మం వైపునకు ఆహ్వానించారు- ఇప్పుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) వృద్ధాప్యదశకు చేరుకున్నారు.

కుమారుల ద్వారా ధార్మిక సేవ

దైవేచ్ఛ ఎలావుందో చూడండి! వృద్ధాప్యంలో హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కు ఇద్దరు కుమారులు కలిగారు. పెద్ద కుమారుని పేరు హజ్రత్ ఇస్మాయీల్(అ), చిన్నవారి పేరు హజ్రత్ ఇస్హాఖ్(అ). ఒక వ్యక్తి ఏదయినా కార్యం కోసం తన సర్వస్వం పణంగా పెట్టడానికి పూనుకున్నాడంటే, తనదైన ఏ వస్తువునైనా సరే ఆ పని కోసం వెచ్చించడంలో వెనుకంజవేయడు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన కుమారులిద్దరినీ, తాను యావజ్జీవితం చేస్తూ వచ్చిన దైవ ధర్మ ప్రచారం కొరకు నియమించడానికి నిశ్చయించుకున్నారు. ఆయన హజ్రత్ ఇస్హాఖ్(అ)ను సిరియా దేశంలో, హజ్రత్ ఇస్మాయీల్(అ)ను ప్రస్తుతం మక్కా పట్టణం ఉన్న ప్రాంతంలో వదలిపెట్టారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన పెద్ద కుమారుణ్ణి, అతని తల్లిని, నిర్జన మైదాన ప్రదేశంలో వదిలి తన ప్రభువు (అల్లాహ్)తో ఇలా ప్రార్థించారు. "ఓ నా ప్రభూ! నా సంతానంలో ఒకణ్ణి వ్యవసాయ యోగ్యముకాని

ఈ ప్రదేశంలో నివాసం కల్పించాను. దేవా! నన్నూ, నా సంతానాన్ని విగ్రహారాధన నుండి రక్షించు. స్వామీ! ఈ విగ్రహ పూజ వలయంలో చిక్కుకుని చాలా మంది మార్గభ్రష్టులయిపొయ్యారు. నా సంతానం కూడా నీ మార్గం తప్పి, నిన్ను మరచి వాటిని పూజించకుండా ఉండుగాక! ఓ ప్రభూ! నా సంతానాన్ని నమాజ్★ ను స్థాపించే నిమిత్తం- ఈ ఎడారిలో వదులుతున్నాను. ప్రభూ! నీ మహిమ చేత వీరికి భోజన పానీయాల ఏర్పాట్లు కలిగించు, వీరి కోసం రకరకాల పండ్లు సృష్టించు."

పరీక్ష

అల్లాహ్ పేరును స్తుతించడం సులభమే. కాని యావజ్జీవితాన్ని అల్లాహ్ కోసం అంకితం చేయడం సులభం కాదు. దైవ మార్గంలో నడవడానికి నిశ్చయించుకున్నవారిని అల్లాహ్ బాగా పరీక్షిస్తాడు కూడా. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తన తాత ముత్తాతల మతాన్ని వదలి, సత్యధర్మాన్ని అవలంబించడానికి నిర్ణయించుకున్న తరువాత ఆయనకు ఎటువంటి కఠిన పరీక్ష ఎదురయిందో చూశారా!? ఆయన తన జీవితాన్ని పణంగా ఒడ్డి తన దేశం, తన ఇల్లు సమస్తమూ త్యజించవలసి వచ్చింది.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ఇవన్నీ చేశారు. దైవ ప్రీతి ముందు తన ధనంగాని, ప్రాణంగాని ప్రియమయినవి కావని ఆయన నిరూపించారు. కాని ఇంకా ఒక పరీక్ష మిగిలింది. ఆయన హృదయంలో తన పుత్రులపై ఉన్న ప్రేమ అల్లాహ్‌పై ఉన్న ప్రేమకన్నా ఎక్కువయిందా? అని చూడవలసి ఉన్నది.

కుమారుని అర్పణ

హజ్రత్ ఇబ్రాహీమ్(అ) ఒకసారి తాను తన ప్రియకుమారుడైన హజ్రత్ ఇస్మాయీల్ (అ) ప్రాణాలను దైవానికి అర్పిస్తున్నట్లు కలగన్నారు, దాని అర్థం

★ నమాజ్‌ను స్థాపించడం అంటే నమాజ్ చేయడమే కాదు. దాని అర్థం, సంపూర్ణ ధర్మాన్ని సంస్థాపించడం అన్నమాట. స్వయంగా ఆ ధర్మాన్ని అనుసరిస్తూ ఇతరులు కూడా దాన్ని అనుసరించేలాజేయాలి.

ఏమిటో ప్రవక్త తెలుసుకున్నారు. ఆయన తన కుమారుడయిన హజ్రత్ ఇస్మాయీల్(అ)ను పిలిచి కల సారాంశం చెప్పారు. దైవాభీష్టాన్ని ఎన్నడూ కాదనని తండ్రి ! ఇంకా - అల్లాహ్ ప్రీతికోసం తన సమస్తాన్ని ధారపోసిన తండ్రి కొడుకు హజ్రత్ ఇస్మాయీల్(అ)!! తన కుమారులను దైవ సందేశకార్యం కోసం అంకితం చేసి, తన కుమారులచేత ఆ ధర్మసంస్థాపన చేయించమని అల్లాహ్‌ను వేడుకున్న ఉత్తముడైన తండ్రి తనయుడు!!! హజ్రత్ ఇస్మాయీల్(అ) తన తండ్రి స్వప్నాన్ని గురించి విని, అల్లాహ్ అభీష్టమేమిటో గ్రహించారు.

"నాన్నగారూ! దైవం తరపున మీకివ్వబడుతున్న ఆజ్ఞను నేరవేర్చండి. దైవం కోరితే. నేను ఎలా ఓర్పు వహిస్తానో మీరే చూస్తారు" అని తండ్రితో పలికారు.

అల్లాహ్ కంటే ఎక్కువ ప్రియమయినది మరేదీ లేదనే ఆ తండ్రి ఎంత ఉత్తముడు! అల్లాహ్ ఆజ్ఞ వినడంతోనే తన ప్రాణాలను సయితం అర్పించడానికి సిద్ధపడిన ఆ కుమారుడు ఎంత గొప్పవాడు! నిజానికి మన దగ్గర ఉన్నదేదీ మనది కాదు. అంతా ఆ యజమానిదే. మనిషి దీన్ని అంగీకరించి సమయం వచ్చినప్పుడు తన సమస్తాన్ని ఆ ప్రభువు కోసం అర్పించేందుకు సిద్ధంగా ఉండాలి. దైవాజ్ఞను సంతోషంతో అమలుచెయ్యాలి. అతనికి అల్లాహ్ కంటే ఎక్కువ ప్రియమైనది మరే వస్తువు కారాదు. ఇస్లామ్ అంటేనే మనిషి తననుతాను దైవానికి సమర్పించుకోవడమని భావం కదా?

సద్గుణ సంపన్నులయిన ఈ ఇద్దరు అల్లాహ్ దాసులు- హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), హజ్రత్ ఇస్మాయీల్ (అ)- దైవాజ్ఞకు తలవంచారు. ఇబ్రాహీమ్(అ) తన ప్రియాతిప్రియమైన కుమారుణ్ణి అల్లాహ్ పేరిట అర్పించేందుకు నేలపై పడవేశారు- అంతే! హజ్రత్ ఇబ్రాహీమ్(అ)కు కుమారుని కంటే దైవాజ్ఞ ప్రియమయినదని తేలిపోయింది. ఈ విషయాన్నే పరీక్షించదలిచాడు అల్లాహ్. హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తన స్వప్నం నిజమని నిరూపించారు. సూచన అందగానే తనకు అత్యంత ప్రియమయినదాన్ని అర్పించడానికి సిద్ధమయ్యారు. ఇదే ఒక ముస్లిమ్ చేయవలసిన పని. ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) పరీక్షలో నెగ్గారు. అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) త్యాగాన్ని స్వీకరించాడు.

"నీవు నీ'కల'ని నిజంచేసి చూపావు. ఇక నీ కుమారుణ్ణి బలి చేయ నక్కరలేదు" అని అల్లాహ్ సందేశం వచ్చింది.

మన కొరకు హితోపదేశం

మనమందరం ముస్లిములమే. మన దగ్గరున్నది ఏదీ మనది కాదని, అల్లాహ్‌దే అని కూడా ఒప్పుకుంటాం. అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటామని, ఆయన ఆజ్ఞ ముందు మన ఇష్టానికిగాని, ఇతరుల కోరికనుగాని లక్ష్యపెట్టమని మనం కూడా ఒప్పందం చేసుకున్నాం. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి గాథలో మనకు కూడ గుణపాఠం ఉంది, అందుకే ప్రతి సంవత్సరం మనం దానిని మననం చేసుకుంటాం: బక్రీద్ పండుగకు పశువులను 'ఖుర్బానీ' ఇచ్చేది ఈ విషయాన్ని గుర్తు చేయడానికే. అల్లాహ్‌చే ఇవ్వబడిన జంతువును అల్లాహ్ మార్గంలో అర్పిస్తున్నామంటే, మన ధన, ప్రాణాలు సర్వం అల్లాహ్‌వే అనీ, ఇంకా సమయం వచ్చినప్పుడు దేన్నయినా దైవం కొరకు త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలనే మన విశ్వాసాన్ని తాజాపరచుకుంటున్నామన్న మాట.

అల్లాహ్ మిత్రుడు

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కు ఎటువంటి కఠిన పరీక్షల్ని ఎదుర్కో వలసివచ్చిందో చూశారా! ఇల్లు వదిలారు. స్వదేశం నుండి బహిష్కరించబడ్డారు. అగ్నిలో తోయబడ్డారు. దేశ దేశాలు తిరగాల్సివచ్చింది. అయినా ఈ పరీక్షలన్నింటిలో ఆయన పూర్తిగా నెగ్గారు. అంతేకాదు. ఓ విషయంలోనయితే ఆయన అద్భుతమే చేశారు. యజమాని (అల్లాహ్) సూచన లభించగానే ఆయన తన ముద్దుల కుమారుని సయితం అర్పించడానికి సిద్ధపడ్డారు. ఈ కారణంచేతనే అల్లాహ్ ఆయన్ను తన మిత్రుడు★ అని పేర్కొన్నాడు. ఆయన్ను సమస్త మానవుల ఇమామ్ (లోక-నాయకుడు)గా చేశాడు.

★ మిత్రుణ్ణి అరబీ భాషలో "ఖలీల్" అంటారు. హజ్రత్ ఇబ్రాహీమ్(అ)ను ఖలీలుల్లాహ్ లేక అల్లాహ్‌కు మిత్రుడు అంటారు. ఒక మనిషికి ఇది ఎంతో ఉన్నత స్థానం.

అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ను, "మేము నిన్ను ప్రపంచ నాయకునిగా చేస్తున్నామ"ని పలుకగా, హజ్రత్ ఇబ్రాహీమ్(అ), "నా సంతానానికి కూడా ఈ హోదా లభిస్తుందా?" అని అడిగారు. అందుకు అల్లాహ్ బదులు చెప్పాడు, "చూడు, నా వాగ్దానం చెడు మార్గం అవలంబించి, స్వయంగా తమపై తాము అన్యాయం చేసుకునేవారికి వర్తించదు."

నిజమే. అల్లాహ్‌కు ఏ వ్యక్తీ ఒక ప్రత్యేక వంశం, లేదా కుటుంబానికి చెందినవాడవడం వల్ల ప్రియుడు కాలేడు. ఎవరైతే మంచిని చేస్తాడో, అల్లాహ్‌ను తన ప్రభువుగా, యజమానిగా అంగీకరించి తదనుగుణంగా జీవితం కొనసాగిస్తాడో అతడే అల్లాహ్‌కు ప్రియమయినవాడు.

కాబా నిర్మాణం

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) అల్లాహ్ ఆజ్ఞననుసరించి కాబా నిర్మాణం మొదలుపెట్టారు. అరబ్ దేశంలోని మక్కా పట్టణమందలి ఒక గృహం పేరే 'కాబా'. ఈ గృహం ఏకేశ్వరోపాసన (ఒకే దేవుని ఆరాధన) చేసేవారి కోసం మాత్రమే కట్టబడింది. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), ఆయన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ) కాబా గోడలు నిర్మిస్తూ దైవాన్ని ఇలా ప్రార్థించారు:

"ఓ మా ప్రభూ! నీవు ఈ ప్రయత్నాన్ని స్వీకరించు. నీవే మా మొరనాలకించేవాడివి. సర్వం తెలిసినవాడివి. మేమీ గృహాన్ని కేవలం నిన్ను సంతోషపెట్టడానికే నిర్మిస్తున్నామన్న విషయం నీకు తెలుసు. ఓ మా యజమానీ! మమ్మల్ని నీ నిజమయిన "ముస్లిమ్"లుగా చెయ్యి. మా వంశంలో కేవలం నీ ఆజ్ఞనే పాలించేవారి (ముస్లిమ్)ని పుట్టించు. నిన్ను ఆరాధించే విధానాలను మాకు నేర్పు. మేము పశ్చాత్తాప్పడి చేసుకునే ప్రార్థనల్ని దయతో స్వీకరించు. మా వల్ల జరిగిన అపరాధాలను మన్నించు. నీవు అమిత దయామయుడవు, క్షమించేవాడవు.

"ఓ మా స్వామీ! మా వంశపరంపరలో నీ వాక్యములను ముమ్మరంగా చదివి వినిపించే, నీవు పంపిన ఆజ్ఞలు వారికి వివరించే, మా వంశస్థుల్ని నీ ధర్మం అర్థం చేసుకునే యోగ్యులుగా చేసే, వారిని పాపముల నుండి

పరిశుద్ధపరిచే ఒక ప్రవక్తను* పుట్టించు. ఓ ప్రభూ! నీవే అందరికన్నా శక్తి మంతుడవు, అందరినీ మించిన వివేకవంతుడవు."

కాబా నిర్మాణం పూర్తయ్యాక, దైవం, కాబాను విగ్రహారాధనకు దూరంగా, పవిత్రంగా ఉంచమని హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)ని ఆజ్ఞాపించాడు. ఈ ఇల్లు కేవలం ఏకేశ్వరోపాసకులకు కేంద్రం. దీన్ని అన్ని రకాల షిర్క్ (బహు దైవారాధన) నుండి పవిత్రంగా ఉంచాలి, దీనిని శాంతికి నిలయంగా చేయాలి. ప్రపంచ నలుమూలల నుండి ప్రజలు ఇక్కడకు వచ్చి ఒకే దేవుని ఆరాధించే పాఠాన్ని గ్రహించి మరలివెళ్ళే అవకాశం లభించాలి. వారు ఇక్కడ నుంచి దేవుని ఏకత్వపు సందేశం** యావత్ప్రపంచానికి అందజెయ్యాలి. ప్రజలు ఇక్కడకు వచ్చి తవాఫ్*** (ప్రదక్షిణం) చేయాలి. అల్లాహ్ ముందు తలవంచి, సజ్దా చేయాలి, అంటే నమాజ్ (ఆరాధన) చేయాలి.

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) అల్లాహ్ ఆజ్ఞను అక్షరాలా పాటించారు. 'కాబా'ను ప్రపంచంలో దేవుని ఏకత్వపు కేంద్రంగా రూపొందించారు.

ఇదే హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)గారి జీవిత చరిత్ర. ఇదే ఆయన మనకిచ్చిన శిక్షణ. ఈ విషయాలకు విముఖత చూపేవాడు ఎంత మూర్ఖుడో ఆలోచించండి. మానవుడికి అన్నింటికన్నా మేలు అతడు తన నిజమయిన ప్రభువు (అల్లాహ్)ను గుర్తించి ఆయన ఆజ్ఞను పాటించడంలోనే ఉంది. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)తన పూర్తి జీవితంలో ఇదే ఆచరించి చూపారు. ఆయన, తన యజమాని

★ *ఇది మహాప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అన్వయిస్తుంది.*

★★ *ఈ సమస్త జీవరాశిని పుట్టించేవాడు, పోషించేవాడు, యజమాని, ప్రభువు, స్వామి, ఆజ్ఞాపించేవాడు, ఆరాధనకు అర్హుడు ఒక్కడే. ఆయనే అల్లాహ్. ఇదే దేవుని ఏకత్వపు సందేశం. ఈ సందేశం ప్రపంచవ్యాప్తం చేయడానికే కాబా నిర్మించబడింది.*

★★★ *కాబా చుట్టూ నాల్గు వైపులా ప్రదక్షిణం చేయడం కూడా ఆరాధనయే. దీన్నే "తవాఫ్" అంటారు.*

ఏదయినా ఆజ్ఞ ఇచ్చినప్పుడల్లా వెంటనే దాన్ని నెరవేర్చారు. ఇంకా, "నేను ఈ సమస్త ప్రాణికోటి పోషకుని (అల్లాహ్)కే★ విధేయుణ్ణి" అన్నారు.

అంతిమ బోధ

తన అంత్య దశలో హజ్రత్ ఇబ్రాహీమ్(అ), తన కుమారులు, మనుమలు, కుటుంబములోనివాళ్ళని పిలిచి ఇలా అన్నారు, "కుమారులారా! అల్లాహ్ మీ కోసం, నేను మీకు నేర్పిన ధర్మాన్నే (ఇస్లామ్)నే ఎన్నుకున్నాడు. మీరు కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ 'ముస్లిమ్'గానే ఉండాలి. ఇస్లామ్ కోసమే ప్రాణం ఇవ్వాలి, ఇదే నా అంతిమ బోధ."

హజ్రత్ లూత్ (అలైహిస్సలామ్)

విపరీతమయిన కామోన్మాదం

హజ్రత్ లూత్ (అ), హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి సోదరుని కుమారుడు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) స్వదేశం విడిచినప్పుడు హజ్రత్ లూత్ (అ) వారి వెంట ఉన్నారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ఆయన్ని సిరియా (షామ్) దేశానికి పంపారు. హజ్రత్ లూత్ (అ) కూడా దైవప్రవక్తయే.

సిరియా దేశంలో మృత సముద్రం (Dead Sea) అనే ఒక చిన్న సముద్రం ఉంది. అది పెద్ద సముద్ర మట్టానికి కొన్ని వేల అడుగుల దిగువన ఉంది. ఆ ప్రాంతంలో నివసించేవారికి సన్మార్గం చూపించేందుకు హజ్రత్ లూత్ (అ) పంపబడ్డారు.

హజ్రత్ లూత్ (అ) వారికి మొదట ఇస్లామ్ ముఖ్య విషయాలు వివరించారు. వారినుద్దేశించి ఆయనిలా అన్నారు:

★ ఖుర్ఆన్‌లో "అస్‌లంతు లి రబ్బిల్ ఆలమీన్" అని ఉంది.

★ ప్రజలారా! మిమ్మల్ని పుట్టించిన అల్లాహ్‌యే మీ యజమాని. మీరు ఆయనకే దాస్యం చేయాలి. ఆయన చెప్పినట్లు మాత్రమే చేయాలి.

★ సోదరులారా! ఒక విషయం గుర్తుంచుకోండి. మీరు ఏ పని చేసినా మీ యజమాని (అల్లాహ్) ఇష్టప్రకారమే చేయండి. మీ యెడల ఆయన అసంతృప్తుడు అవుతాడన్న భయం కలిగి ఉండండి.

★ అల్లాహ్‌ను సంతోషపరచడానికి మీరు నా మాట వినండి. నేను చెప్పిన పని చేయండి.

★ నేను చేసే ఏ పనికి మీ నుండి ఏమీ ప్రతిఫలం కోరను, నాకు దొరికేదేదో అది అల్లాహ్ నుండి ప్రాప్తమవుతుంది. మీ నుండి నేను తీసుకోవాల్సింది ఏమీ లేదు.

ఈ విషయాలు చెప్పిన తరువాత హ్రజత్ లూత్ (అ) వారిని, వారు చేసే నీచకార్యం నుండి ఆపారు. అదేమంటే వారు బాలురతో చెడు పని చేసేవారు. వారికంటే ముందు ప్రపంచంలో ఈ నీచకార్యాన్ని ఎవ్వరూ ఎరుగరు. అందరి కంటే ముందు వీరే ఆ సిగ్గుమాలిన పనిని మొదలుపెట్టారు.

ఒక వ్యక్తి నీతిబాహ్యమయిన కార్యాలలో ఇరుక్కుంటే అవి అతనికే మంచివిగా కనబడతాయి. ఆ జాతివారు హ్రజత్ లూత్ (అ) గారి మాటలను విన్నాక రెచ్చిపోయారు.

"ఓహో! పెద్ద సత్పురుషుడివి బయలుదేరావు! ఇలా అయితే నిన్ను ఊళ్ళోంచి బహిష్కరిస్తాం, ఇటువంటి బోధలను చేయదలచుకుంటే వేరేచోటికి ఎక్కడికయినా వెళ్ళు. ఇక్కడ నీకు స్థానం లేదు" అని అన్నారు.

హ్రజత్ లూత్ (అ) ఎన్నో విధాలుగా వారికి నచ్చజెప్పారు. అల్లాహ్‌కు ఆగ్రహం కలిగిస్తే జరిగే పర్యవసానం ఏమిటో సవివరంగా తెలిపారు. "ఆయన (అల్లాహ్) శక్తిమంతుడు. ఆయన పట్టు చాలా కఠినమైనది. ఆయన కలిగించే విపత్తుకు భయపడండి. నాకేమీ కాదు. మీరంతా

సర్వనాశనమవుతారు. ఇహంలోనూ నాశనమవుతారు. ఆ తరువాత వచ్చే శాశ్వతమైన పరలోకంలో కూడా దైవాగ్రహానికి లోనవుతారు. నరకం మీ నివాసమవుతుంది."

చెప్పవలసిందంతా చెప్పడం జరిగింది. ప్రజలు హజ్రత్ లూత్ (అ) మాటల్ని పెడచెవిన పెట్టారు. శిక్షా సమయం దగ్గరపడింది. హజ్రత్ లూత్ (అ) ఇంటికి కొందరు అతిథులు వచ్చారు. అతిథులు చూడ్డానికి బాలురుగాను, అందంగా ఉన్నారు. వీళ్ళను చూశాక ఊరివాళ్ళకు దుర్బుద్ధి కలిగింది. హజ్రత్ లూత్ (అ)కు చాలా విచారం కలిగింది. ఆయన వాళ్ళతో చెప్పారు, "చూడండి, నా అతిథుల్ని అవమానపర్చకండి, మీకేమయిపోయింది? మంచిని బోధించే పెద్ద మనిషి మీలో ఒక్కడయినా లేకపోయాడా? అల్లాహ్ పురుషుల కోసం స్త్రీలను సృష్టించాడు, వాళ్ళని పెళ్ళాడండి, అదే మంచి పని. అది తప్ప మరేది చేసినా చెడు కార్యమే, పెద్ద పాపం కూడా. ఈ జాతిలో చాలా మంది కన్యలున్నారు. వారంతా నా కుమార్తెలవంటివారు. మీరు వాళ్ళని 'నికాహ్' (వివాహం) చేసుకోండి."

పాపఫలం పండిన వేళ...

ఆ జాతిలోని దుర్మార్గులు హజ్రత్ లూత్ (అ) మాటలను వినీ విననట్లు ప్రవర్తించారు. "మా వ్యవహారం ఏమిటో మాకు తెలుసు. మాకు ఆడవాళ్ళతో ఏం పని? ఈ మాటలను మేము ఒప్పుకోం" అని అన్నారు. హజ్రత్ లూత్(అ)కు ఏం చెయ్యాలో తోచక ఆందోళన ఎక్కువయింది. ఇంతలో ఆ అతిథులు హజ్రత్ లూత్ (అ) తో, "మీరు ఆవేదన చెందనక్కరలేదు. మేము అల్లాహ్ పంపిన దైవదూతలం. ఈ ప్రజలపై విపత్తు (అజాబ్)ను తెచ్చాం. ఉదయం వరకు వేచి చూడండి, ఏమవుతుందో! ఇక తెల్లవారడానికి ఎంతో సమయం పట్టదు."

అల్లాహ్ ఆజ్ఞల్ని చెలాయించేందుకు దైవదూతలు పని చేస్తారు. ప్రపంచ వ్యవస్థకు కావలసిన ఏర్పాట్లన్నీ అల్లాహ్ వారిచేతనే చేయిస్తాడు. ప్రజలకు

వరాలు వీళ్ళే తెస్తారు. శాపాలూ వీళ్ళే తెస్తారు. అల్లాహ్ ఆ ప్రజలపై శిక్షను పంపగా దైవదూతలు అందమయిన బాలుర రూపంలో వచ్చారు. ఆ దుర్మార్గులు వీరిని చూసి ప్రవర్తించిన తీరునుబట్టి ఇక వీరు సన్మార్గానికి రారని తేటతెల్ల మయిపోయింది.

హజ్రత్ లూత్ (అ) మరోసారి వారికి హితబోధ చేశారు. కాని వాళ్ళు ఇంతవరకూ చేస్తూ వచ్చినట్లుగానే ఆ మాటల్ని తిరస్కరించారు.

దైవదూతలు హజ్రత్ లూత్ (అ)తో, "ఇక శిక్షా సమయం సమీపించింది. మీరు మీ (ముస్లిమ్) అనుచరులతోబాటు రాత్రికి రాత్రే బస్తీ విడిచి దూరంగా వెళ్ళండి" అని అన్నారు. హజ్రత్ లూత్ (అ) అలాగే చేశారు. హజ్రత్ లూత్(అ) గారి భార్య ఇంతవరకు ముస్లిమ్ అవలేదు. ఆమెను ఆ తిరస్కారులతోటే వదిలేశారు. వాస్తవానికి మానవుడి మంచి పనులు అల్లాహ్ ఆగ్రహం నుండి అతణ్ణి తప్పించగలవు. ఇక్కడ బంధుత్వం పనికిరాదు. ప్రవక్త భార్య అయినంత మాత్రాన ఏ స్త్రీ అల్లాహ్ మెప్పును పొందజాలదు. అల్లాహ్ ఇష్టప్రకారం నడుచుకునే స్త్రీ పురుషులు మాత్రమే దైవప్రీతికి పాత్రులవుతారు.

హజ్రత్ లూత్ (అ), ఆయన అనుచరులు బస్తీ విడిచి దూరంగా వెళ్ళాక, ఆ ఊరిపై దైవ శిక్ష విరుచుకుపడింది. అగ్ని పర్వతం బ్రద్దలయినట్లు అయింది. ఆ బస్తీ అంతా తల్లక్రిందులయింది. విపరీతంగా రాళ్ళ వర్షం కురిసింది; దైవ తిరస్కారులు నామరూపాల్లేకుండాపొయ్యారు.

దైవ ప్రవక్తను ధిక్కరించినవారు అక్కడ ఎప్పుడూ నివసించనేలేదన్నట్లుగా, ఒక్క నిమిషంలో తుడిచిపెట్టుకుపోయారు. నిజానికి అల్లాహ్ పట్టు చాలా కఠినమయింది. ఆయన తీర్పును ఎవరూ మార్చలేరు. ఆయన గొప్ప శక్తిమంతుడు. అల్లాహ్ ఆజ్ఞల్ని త్రోసిరాజన్నవారికి, ఆయన ప్రవక్తలు బోధించినదాన్ని అనుసరించనివారికి ఇందులో గొప్ప గుణపాఠముంది.

మరువరాని మంచి మాటలు

1. మనసుల్లో నుండి దైవభీతి తొలగిపోయినప్పుడు సన్మార్గంపై నడవడం మానవుడికి కష్టతరమవుతుంది.

2. మానవుని కోసం దైవ సందేశం తెచ్చే ప్రవక్తలు మానవులే, దైవదూతలో, అవతారాలో★ కారు.

3. అల్లాహ్ ప్రతి ఒక్కరికీ బుద్ధిజ్ఞానాలు ప్రసాదించాడు. మానవుడు ఈ జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. పూర్వీకుల మాటల్ని గ్రుడ్డిగా అనుసరించడం సమంజసం కాదు.

4. సత్యంపై నిలకడ కల్గి ఉండటం, ఎట్టి పరిస్థితుల్లోనూ సత్యాన్నే పలకడం అన్నింటికన్నా గొప్ప సత్కార్యం.

5. అల్లాహ్‌యే ఈ ప్రపంచానికి యజమాని అనీ. ఆయనే ఆరాధనకూ, విధేయతకూ అర్హుడనీ ఎవరైతే నమ్ముతారో వారు, దైవమార్గం నుండి దూరంగా ఉన్నవారిని దైవం వైపు ఆహ్వానించాలి. ఇందుకోసం అన్ని రకాల కష్టాలను ఎదుర్కొనేందుకు వారు సిద్ధంగా ఉండాలి.

6. అల్లాహ్‌ను సంతోషపరచేందుకు ప్రతి ఒక్కరి అసంతృప్తినీ సహించవచ్చు. ఇంకా, దైవదాస్యం వైపునకు, దైవధర్మం వైపునకు ప్రజల్ని ఆహ్వానించే నిమిత్తం, ఇల్లూవాకిలీ, స్వదేశం- సమస్తమూ విడనాడవచ్చు.

7. ఒక విశ్వాసి తన సిరిసంపదలు, సంతానం , స్వగృహం, స్వదేశం, అప్తులు- ఆఖరికి తన ప్రాణం సయితం త్యజించగలడు. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను ధర్మం నుండి మరలలేడు. ఇతరుల్ని ఆ ధర్మం వైపునకు ఆహ్వానించకుండా ఉండలేడు. నిజమయిన విశ్వాసికి గుర్తు ఇదే.

★ మానవులకు సన్మార్గం చూపేందుకు దేవుడే మానవ రూపంలో వస్తాడని, దానినే అవతారం అంటారని కొందరు భావిస్తారు. కాని అది నిజం కాదు.

8. స్వయంగా తాను విశ్వాసి (ముస్లిమ్)గా ఉండటంతోపాటు తన సంతానాన్ని కూడా విశ్వాసులుగా, ముస్లిమ్‌లుగా చేయడం విశ్వాసికి అన్నిటికన్నా గొప్ప విజయం.

9. మానవ పతనానికి అసలు కారణం దైవాన్ని మరవడమే. ప్రజల్లో ఏదయినా చెడును చూచినప్పుడు ముందుగా మనుషుల హృదయాలలో అల్లాహ్‌పై విశ్వాసం, ఆఖిరత్ (పరలోకం)పై నమ్మకం దృఢతరం చేయాలి. ఈ విశ్వాసం స్థిరంగా లేనంతవరకూ ప్రజలు చెడులను విడువరు.

10. దైవప్రవక్తను తిరస్కరించి, ఆయన తెచ్చిన హితబోధల్ని ధిక్కరించేవారిలో కనీసం కొందరయినా సన్మార్గం వైపునకు తప్పక వస్తారనే ఆశ ఉన్నంతవరకు వారిని వదలిపెట్టడం జరుగుతుంది. ఆ ఆశ కాస్తా పోయినప్పుడు దైవ తిరస్కారులు అంతమొందించబడతారు.

11. ఎవరైతే స్వయంగా సత్ప్రవర్తన కలిగి ఉండి ఇతరుల్ని మంచి వైపునకు ఆహ్వానిస్తారో అలాంటివారే అల్లాహ్ శిక్ష నుండి రక్షించబడేవారు.